andhrajyothy.com
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.8 • కనిష్ఠం 18.6
ఆంధ్రజ్యోతి
నిర్మల్ జిల్లా వార్తలు
10
ఆదివారం 2 ఫిబ్రవరి 2025





దారి తప్పుతోంది

- సీఆర్ఎఫ్ నిధుల రోడ్ల నిర్మాణాలపై సందేహాలు
- ఇప్పటికే ముథోల్ నియోజకవర్గంలో పూర్తి కావస్తున్న రహదారులు
- జిల్లా కేంద్రంలో మాత్రం అనేక ఆటంకాలు
- సహకరించని ప్రజా ప్రతినిధులు
- టెండర్లు పూర్తయ్యి ఐదు నెలలైనా మొదలు కాని పనులు
- ఆలస్యంపై అనుమానాలు

నిర్మల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వివిధ పథకాల కింద చేపడుతున్న రోడ్ల నిర్మాణాలపై నీలినీడలు కమ్ముకుంటున్నాయన్న ఆరోపణలున్నాయి. వివిధ పథకాల కింద విడుదలవుతున్న నిధులతో చేపట్టాల్సిన పనుల వ్యవహారంపై జరుగుతున్న ప్రచారం సందేహాలకు ఆస్కారమిస్తోంది. ముఖ్యంగా జిల్లాకు మంజూరైన సీఆర్ఎఫ్ నిధులతో చేపట్టాల్సిన రోడ్ల నిర్మాణాల విషయంలో భిన్న దృక్పథం కొనసాగుతోంది. సెంట్రల్ రోడ్డు ఫండ్ (సీఆర్ఎఫ్) కింద ముథోల్ నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణాలకు రూ.30 కోట్ల రూపాయలు అలాగే నిర్మల్ నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణాలకు రూ.25 కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. దాదాపు ఈ రెండు నియోజకవర్గాలకు కలిపి రూ.55 కోట్ల రూపాయల నిధులు మంజూరు అయినట్లు అధికారులు స్పష్టం చేస్తున్నారు. ముథోల్ నియోజకవర్గంలోని కుంటాల మండలం ఆర్లి గ్రామం నుంచి ముథోల్ వరకు పదమూరున్నర కిలోమీటర్ల రోడ్డు వైడింగ్‌తో పాటు బీటి రోడ్డు నిర్మాణం కోసం సీఆర్ఎఫ్ కింద రూ.30 కోట్ల రూపాయలు విడుదలయ్యాయి. ఆర్అండ్‌బీ శాఖ అధికారులు టెండర్ ప్రక్రియను పూర్తి చేసి సంబంధిత కాంట్రాక్టర్ ద్వారా పనులు కూడా ప్రారంభింపజేశారు. ఇప్పటి వరకు ఈ రోడ్డు నిర్మాణ పనులు 40 శాతానికి పైగా పూర్తి కావడం గమనార్హం. 2026 ఫిబ్రవరి వరకు ఈ రోడ్డు నిర్మాణ పనుల పూర్తికి గడువు ఉన్నప్పటికి సంబంధిత ఎమ్మెల్యేతో పాటు అధికార పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు పూర్తి సహకారం అందించడంతో పనులు వేగంగా సాగుతున్నట్లు చెబుతున్నారు. ముఖ్యంగా రోడ్డు నిర్మాణానికి సంబంధించి క్షేత్రస్థాయిలోని ఆటంకాలన్ని తొలగిపోయేందుకు ఇక్కడి ప్రజా ప్రతినిధులు రాజకీయాలను పక్కన పెట్టి సమిష్టిగా చొరవ తీసుకున్నారంటున్నారు. దీని కారణంగానే అగ్రిమెంట్ పూర్తి కాగానే సంబంధిత కాంట్రాక్టర్ యుద్ధ ప్రతిపాదికన పనులను మొదలుపెట్టారు. ప్రస్తుతం పనులు ఛకఛకా కొనసాగుతున్నాయి. ఏప్రిల్‌లోగా పనులు పూర్తి చేసేందుకు సంబంధిత కాంట్రాక్టర్‌తో పాటు అధికారులు శ్రమిస్తున్నారు.

నిర్మల్‌లో మాత్రం విభిన్నం

కాగా సీఆర్ఎఫ్ కింద నిర్మల్ నియోజకవర్గానికి రూ.25 కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. మంజూరైన నిధుల ఆధారంగా ఆర్ అండ్ బీ శాఖ అధికారులు టెండర్ ప్రక్రియను పూర్తి చేసి పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించారు. కాగా కాంట్రాక్టర్ గత ఐదు నెలల క్రితమే ఆర్ అండ్ బీ శాఖ ఆధ్వర్యంలో టెండర్ ప్రక్రియను కూడా పూర్తి చేసుకొని పనులు చేసేందుకు సిద్ధమైనప్పటికి కొన్ని కారణాల వల్ల ఆ పనులు ఇప్పటికి మొదలుకాలేదు. నియోజకవర్గంలోని చిట్యాల గ్రామం నుంచి సోన్ మండలం గాంధీనగర్ వరకు దాదాపు 15 కిలోమీటర్ల పొడవుతో వైండింగ్ పనులతో పాటు బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు ఈ టెండర్ ప్రక్రియ ఖరారైంది. అయితే ఐదు నెలల నుంచి పనులు మొదలుకాకపోవడం పట్ల స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ముథోల్ నియోజకవర్గంలో మాత్రం సీఆర్ఎఫ్ కింద మంజూరైన నిధులతో రోడ్డు పనులు చకాచకా సాగుతుండగా నిర్మల్‌లో మాత్రం ఐదు నెలల నుంచి పనులు మొదలుకాకపోవడం వెనక అంతర్యమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా పనులు మొదలుకాకపోవడం వెనక పలు కారణాలున్నాయన్న ప్రచారం ఊపందుకుంటోంది. అసలే నిధుల కొరత కారణంగా అభివృద్ధి పనులకు అనేక చోట్ల ఆటంకాలు జరుగుతుండగా కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన నిధులతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టకపోవడం ఏంటని పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఇక్కడి పనుల ప్రారంభానికి ప్రజా ప్రతినిధులు, రాజకీయ నేతలు సహకరించడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

బిల్లుల చెల్లింపు జరగని కారణంగానే..

ఇదిలా ఉండగా చిట్యాల్ నుంచి గాంధీనగర్ వరకు చేపట్టాల్సిన రోడ్డు నిర్మాణ పనుల్లో జాప్యంపై భిన్న రకాల వాదనలు వినిపిస్తున్నాయి. రాజకీయ కారణాల వల్లనే రోడ్డు నిర్మాణ పనులు మొదలుకావడం లేదని కొందరు వాదిస్తుండగా మరికొందరు మాత్రం ప్రభుత్వం సక్రమంగా బిల్లులు విడుదల చేయకపోతున్న కారణంగానే సదరు కాంట్రాక్టర్ ఈ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టేందుకు వెనకాడుతున్నారంటున్నారు.

అయితే ఇదే కాంట్రాక్టర్ ముథోల్ నియోజకవర్గంలో కూడా పనులు దక్కించుకొని ఇప్పటికే ఆ పనులను కొనసాగిస్తుండడం చర్చకు తావిస్తోంది. బిల్లులు విడుదలకానట్లయితే సదరు కాంట్రాక్టర్ కుంటాల మండలంలోని ఆర్లి నుంచి ముథోల్ వరకు రోడ్డు నిర్మాణ పనులను ఎలా మొదలుపెడతారన్న వాదనలు వినిపిస్తున్నాయి. అయితే రాజకీయ ఒత్తిళ్ళ కారణంగానే పనుల ప్రారంభానికి ఆటంకాలు కలుగుతున్నాయన్న ప్రచారం ఊపందుకుంటోంది.

45 కోట్ల బిల్లులు పెండింగ్

అశోక్‌కుమార్, ఈఈ ఆర్ అండ్ బీ, నిర్మల్ జిల్లా



ఆర్ అండ్ బీ పరిధిలో 15 పనులకు సంబంధించి రూ.45 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. సక్రమంగా బిల్లులు చెల్లింపులు జరగకపోవడంతోనే పనులు ప్రారంభించేందుకు కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదు. నిర్మల్ మండలం చిట్యాల్ గ్రామం నుంచి సోన్ మండలంలోని గాంధీనగర్ గ్రామం వరకు చేపట్టాల్సిన రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించి తగిన చర్యలు తీసుకుంటాం. నిర్మాణ పనులకు సంబంధించి గడువు ఉన్నందున సకాలంలోనే పనులు పూర్తి చేయిస్తాం. బిల్లుల చెల్లింపు జరగగానే పనులు మొదలవుతాయి.

వికసిత్ భారత్‌కు బడ్జెట్ ప్రతిరూపం

• ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్



ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్

భైంసా, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థికశాఖ మంత్రివర్యులు నిర్మలా సీతారామన్ శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్ వికసిత్ భారత్ ప్రతిబింబిస్తోందని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ పేర్కొన్నారు. శనివారం భైంసాలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. వార్షికాదాయం రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు ఇవ్వడం ఎంతో గొప్ప పరిణామం అని తెలిపారు. పేదలు, మహిళలు, యువత, రైతుల సంక్షేమానికి బడ్జెట్‌లో ప్రాధాన్యతనిచ్చారని వివరించారు. రాబోయే ఐదేళ్లలో వృద్ధికి 6 కీలక రంగాలను బడ్జెట్ గుర్తించిందన్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థికశాఖ మంత్రివర్యులు నిర్మలా సీతారామన్‌కు ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర బడ్జెట్‌పై విపక్షాలు అనవసర,అర్థరహిత ఆరోపణలు, విమర్శలు మానుకోవాలని, కేంద్రానికి సహకరించాలని సూచించారు.

ధ్యాన హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాల్వలక్ష్మీ నరసింహస్వామి కోనే రు పక్కన శ్రీ ధ్యాన హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవానికి ఏర్పాట్లు చకచకా జరుగుతు న్నాయి. శనివారం 18 అడుగుల హనుమాన్ విగ్రహాన్ని మేళ తాళా ల మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఈ నెల 6వ తేదీ నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 8వ తేదీన 18 అడుగుల ధ్యాన ముద్రలో ఉన్న హనుమాన్ విగ్రహాన్ని లక్ష్మీ నరసింహ స్వామి కోనేరు పక్కన ప్రతిష్ఠించనున్నారు. అత్యంత నియమ నిష్టలతో ప్రత్యేకపూజలు నిర్వహించేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి భారీగా హనుమాన్ భక్తులను సమీకరిస్తున్నారు. విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం పెద్ద ఎత్తున భక్తులకు అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వసంత పంచమి వేడుకలు ప్రారంభం



ఉత్సవాల ప్రారంభోత్సవంలో ముథోల్ ఎమ్మెల్యే రాంరావు పటేల్

బాసర, ఫిబ్రవరి 1 : (ఆంధ్రజ్యోతి) : బాసర అమ్మవారి సన్నిధిలో వసంతపంచమి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు ఉత్సవాలు కొనసాగనున్నాయి ఉదయమే సరస్వతి అమ్మవారికి విశిష్ట అభిషేక పూజలు నిర్వహించారు. చండీసహిత మేధా దక్షిణమూర్తి యాగాన్ని, గణపతి పూజ వంటి వివిధ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్సవాల ప్రారంభోత్సవ పూజల్లో ముథోల్ ఎమ్మెల్యే రామరావు పటేల్ పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. మొదటి రోజు భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. చదువుల మాత సన్నిధిలో తమ పిల్లలకు అక్షర శ్రీకార పూజలు జరిపించారు. ఉత్సవాలను పురస్కరించుకొని వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. పోలీసుల ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 200ల మంది పోలీసు సిబ్బంది, వివిధ స్థాయి అధికారులు బందోబస్తులో పాల్గొన్నారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

సోన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జాఫ్రాపూర్ గ్రామానికిచెందిన బొద్దుకూరి రాంరెడ్డి (63) మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు రాంరెడ్డి గత కొన్ని రోజుల నుంచి మద్యానికి బానిసై శుక్రవారం మధ్యాహ్నం బాత్‌రూమ్‌లో ఉన్న హార్పిక్ ఎక్కువ మొత్తంలో సేవించడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే నిర్మల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఆయన పేర్కొన్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మద్యం మత్తులో బోర్లాపడి యువకుడి మృతి

భైంసా, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుజిరిగల్లికి చెందిన యువకుడొకరు మద్యం మత్తులో బోర్లా పడి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. భైంసా టౌన్ ఎస్ఐ గౌస్ ఆహ్మద్, మృతుని కుటుంబీకులు తెలిపిన కథనం ప్రకారం ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గుజిరిగల్లికి చెందిన జాదవ్ గణేష్ (27) మద్యానికి బానిసగా మారి రోజు మద్యం సేవిస్తూ కూలీ పనులు నిర్వహిస్తుంటాడు, శుక్రవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన జాదవ్ గణేష్ తిరిగి ఇంటికి వెళ్లలేదు . మద్యం సేవించిన మత్తులో స్థానిక భట్టిగల్లి మున్నూరుకాపు సంఘ భవనం రోడ్డు మార్గంలో బోర్లాపడి మృతి చెందాడు, శనివారం ఉదయం వేళలో భట్టిగల్లివాసులు రోడ్డుపై బోర్లా పడి ఉన్న మృతదేహాన్ని గుర్తించి జాదవ్ గణేష్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో ఘటన వెలుగు చూసింది. మృతుని తండ్రి జాదవ్ బాపురావ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ ఎస్ఐ గౌస్ ఆహ్మద్ కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు ప్రారంభించారు. మృతదేహానికి పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఉరి వేసుకుని ఒకరి బలవన్మరణం

భైంసా రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సుంక్లి గ్రామానికి చెందిన ఆది రాజేందర్ ఉరి వేసుకుని మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆది రాజేందర్(37)కు గత 6 సంవత్సరాల క్రితం వివాహమై విడాకులు జరిగాయి. అప్పటి నుండి ఒంటరిగానే జీవనం కొనసాగిస్తున్నాడు. కొన్ని రోజులుగా మానసికంగా తనలో తానే బాధపడుతూ ఉండేవాడు. జీవితంపై విరక్తి చెంది రాత్రి ఒంటరి తనం భరించలేక తన ఇంటి ముందు పశువుల కోసం వేసిన రేకుల షెడ్డుకు నైలాన్ తాడుతో ఉరి వేసుకుని మృతి చెందాడు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై మాలిక్ తెలిపారు.

నారాయణ గుట్ట విహారయాత్రకు వేదం విద్యార్థులు

లోకేశ్వరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బాగాపూర్ శివారులో గల లక్ష్మీనారాయణ స్వామి దేవాలయం మాఘమాసంలో మొదటి శనివారం కావడంతో వేదం పాఠశాల విద్యార్థులు, టీచర్లు విహారయాత్రగా నారాయణ గుట్టను సందర్శించారు. లక్ష్మీనారాయణ స్వామిని దర్శించి పూజలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నరసింహస్వామి దేవాలయ ప్రాముఖ్యత వివరించారు. విద్యార్థులందరూ శ్రద్ధగా చదవాలని ఆశీర్వదించారు. కరస్పాండెంట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలి

• రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్‌రెడ్డి



జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి

నిర్మల్ అర్బన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్‌రెడ్డి రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రధాన అధికారి మాట్లాడుతూ.. ఈ నెల 27వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించనున్న జిల్లాల్లో పటిష్ట చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ ప్రక్రియలో భాగంగా ఈ నెల మూడవ తేదీ నుంచి నోటిఫికేషన్ అమలులోకి వస్తుందని తెలిపారు. 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 11న నామినేషన్ల పరిశీలన, 13వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ, 27న ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మార్చి 3వ తేదీన ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ముగిసే వరకు ఎటువంటి అవాంఛనీయఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని, ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరం నుంచి కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ... జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులు అంతా సమన్వయంతో పని చేసి ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీసీని విధుల నుంచి తొలగింపు

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్ కార్యాలయంలో సీసీగా పని చేస్తున్న రాకేష్‌ను విధుల నుంచి తొలగించినట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల దృష్ట్యా జిల్లా కలెక్టర్ సీసీగా విధులు నిర్వహిస్తున్న రాకేష్‌ను విధుల నుంచి తప్పిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల ఘటనపై కలెక్టర్ తీవ్రఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతమైతే సంబంధిత ఉద్యోగులపై కఠినచర్యలు ఉంటాయని, విధులుకు చెడ్డ పేరు తీసుకువచ్చేలా ప్రవర్తిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ప్రతి ఉద్యోగి బాధ్యతగా, క్రమశిక్షణగా నడుచుకోవాలని ఆ కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.

మోదుగ ఆకు విస్తర్ల తయారీ అభినందనీయం

• ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



లింగాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

ఖానాపూర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు మోదుగ ఆకులతో విస్తర్లను తయారీ చేయడం అభినందనీయమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం కడెం మండలంలోని లింగాపూర్ గ్రామంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ప్రకృతి ఎంటర్ప్రైజెస్ పేరిట ఏర్పాటు చేసిన విస్తరాకు కుటీర పరిశ్రమను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రకృతిలో సహజసిద్ధంగా లభించే మోదుగాకుతో విస్తర్లను తయారు చేస్తూ లింగాపూర్‌కు చెందిన మహిళలు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. మహిళలను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పి ప్రజలకు మేలు చేసే విధంగా ఉండాలని సూచించారు. అనంతరం ఎల్లగడప గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఆకుల లచ్చన్న, స్థానిక నాయకులు, మహిళలు, తదితరులున్నారు.

ప్రణాళికతో చదివితే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు

భైంసా, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి ప్రణాళికతో చదివితే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడం ఖాయమని మోహన్‌రావ్ పాటిల్ ప్రజా ట్రస్టు చైర్మెన్ బోస్లే మోహన్‌రావ్ పాటిల్ పేర్కొన్నారు. శనివారం భైంసా మండల పరిధిలోని పలు ఉన్నత పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు ట్రస్టు ఆధ్వర్యంలో పరీక్షలు రాసేందుకు ప్యాడ్లను పంపిణీ చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో మాట్లాడారు. ఇందులో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ రమణరావ్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయ బృందం, ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా మార్కండేయ జయంతి



మార్కండేయ డోలారోహణంలో పాల్గొన్న పద్మశాలీలు

కుంటాల, ఫిబ్రవరి, 1 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలంలోని కల్లూరు గ్రామంలో శనివారం మార్కండేయ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఇట్టి కార్యక్రమంలో భాగంగా ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి హోమ కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రామరావు పటేల్‌పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

నర్సాపూర్(జి)లో..

నర్సాపూర్(జి), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని స్థానిక పద్మశాలి సంఘ భవనంలో శనివారం శ్రీ భక్త మార్కండేయ జయంతిని పద్మశాలి కుల సంఘ సభ్యులు ఘనంగా నిర్వహించారు. శివుడి భక్తుడైన మార్కండేయుని విశిష్టతను వేద పండితులు నరహరి సభ్యులకు వివరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి కుల సంఘ సభ్యులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

సారంగాపూర్‌లో..

సారంగాపూర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు బీరవెల్లి, ప్యారమూర్, కౌట్ల(బి), చించోలి(బి) గ్రామాలతో పాటు తదితర గ్రామాల్లో శనివారం పద్మశాలి సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా మార్కండేయ జయంతిని నిర్వహించారు. ఈ నేపథ్యంలో మార్కండేయ ఆలయంలో పూజలు చేసి మొక్కులను మొక్కారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే బీరవెల్లిలో మార్కండేయ రథాన్ని వీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లారు.

ముథోల్ మండల కేంద్రంలో..

ముథోల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : భక్త మార్కండేయ మహర్షి జయంతిని పురస్కరించుకొని శనివారం మండల కేంద్రమైన ముథోల్, చించాల తదితర గ్రామాల్లో పద్మశాలి సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బసవరాజు పూజారి ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, అన్నపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

గజ్జలమ్మ మాలధారణ చేసిన భక్తులు



ఆలయం వద్ద మాలధారణ చేసిన స్వాములు

కుంటాల, ఫిబ్రవరి, 1 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాల ప్రజల ఇలవెల్పు గజ్జలమ్మ 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నుండి గ్రామస్తులు గజ్జలమ్మ మాలధారణ కార్యక్రమం చేపట్టారు. 11 రోజుల పాటు నియమ నిష్టలతో గజ్జలమ్మ ఆలయంలో ప్రతి రోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ దీక్షను కొనసాగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కాల్వ తండా వాసికి డాక్టరేట్ ప్రదానం

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాల్వ తండాకు చెందిన రాథోడ్ సందీప్‌కు వెల్ ఎడ్యుకేషన్ అండ్ పీస్ కౌన్సిల్ వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. కాల్వ తండా గ్రామానికి చెందిన రాథోడ్ దేవిక, నరేందర్‌ల కుమారుడు రాథోడ్ సందీప్ సమాజ, వ్యవసాయ, విద్యారంగంలో చేసిన సేవలకు గాను వ్యవసాయ శాస్త్ర విభాగంలో భారత ప్రభుత్వంచే గుర్తించబడిన వెల్ ఎడ్యుకే షన్ అండ్ పీస్ కౌన్సిల్ వారు న్యూ ఢిల్లీలోని భారత రాజ్యాంగ సముదాయ భవనంలో జరిగిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో రాథోడ్ సందీప్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సందీప్‌ను కాల్వ తండా వాసులు అభినందిస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవికాలం దృష్టిలో ఉంచుకొని విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా పట్టణంలోని శరత్ మహల్ కోర్టు, బీఎస్ఎన్ఎల్ ఏరియాలో ఉదయం 11 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు, ఏరియా ఆసుపత్రి, బర్కత్‌పురా ఏరియాలో మధ్యాహ్నం 1:30 నుండి 5:30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

పది విద్యార్థులకు ప్రారంభమైన అల్పాహారం అందచేత

భైంసా, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న పదో తరగతి విద్యార్థులకు శనివారం నుంచి అల్పాహారం అందచేత ప్రారంభమయ్యింది. సాయంత్రం వేళలో విద్యార్థులకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం అల్పాహారం పంపిణీకి శ్రీకారం చుట్టింది.

మళ్లీ నిరాశే..!

(7వ పేజీ తరువాయి)

అంటూ కాలం గడుపడమే తప్ప స్పష్టత ఇవ్వక పోవడంతో ఎయిర్ పోర్టు నిర్మాణంపై జిల్లా వాసులు ఆశలు వదులుకుంటున్నారు.

పరిమితి పెంపుతో ప్రయోజనమే..

వ్యవసాయమే ప్రధాన జీవనాధారమైన జిల్లా కు కిసాన్‌కార్డుల పరిమితి పెంపుతో కొంత మేరకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉందంటున్నారు. జిల్లాలో సుమారుగా 90 వేల మంది రైతులకు ప్రయోజనం కలుగనుంది. గతంలో ఉన్న రూ.3 లక్షల పరిమితిని రూ.5లక్షలకు పెంచుతూ బడ్జెట్‌లో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎన్నో ఏళ్ల తర్వాత పరిమితిని పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా ఇచ్చే రుణాలకు వడ్డీ 4 లేదా అంతకన్న తక్కువగా ఉంటుందని ప్రభుత్వం ప్రకటించింది. అలాగే ఈ కార్డు పొందిన వారికి ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, జీవన జ్యోతి బీమా యోజన పథకాలను కూడా వర్తింప చేయనున్నారు. అలాగే రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం మరో పథకాన్ని తీసుకొస్తోంది. పీఎం ధన్ ధాన్య కృషి యోజనలో జిల్లాకు చోటు దక్కే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది. దీంతో తక్కువ పంటల ఉత్పాదకత కలిగిన జిల్లాకు ప్రభుత్వ సహాయం అందే అవకాశం కనిపిస్తోంది.

నిధులు రాబట్టలేకపోయారు

జిల్లా ప్రజలు బీజేపీకి అండగా నిలిచినా బడ్జెట్‌లో ఆశించిన స్థాయిలో నిధులను రాబట్టలేక పోయారన్న విమర్శలు వస్తున్నాయి. మునుపెన్నడూ లేని విధంగా 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఆదిలాబాద్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి విజయం సాధించారు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లోనూ బీజేపీ అభ్యర్థినే పార్లమెంట్ సభ్యుడిగా గెలిపించారు. అయినా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో మొండి చెయ్యే చూపిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. స్వయాన ప్రధాని మోదీ జిల్లాకు వచ్చి పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా నేతలు, రాష్ట్ర ప్రభుత్వం జిల్లా దీర్ఘకాలిక సమస్యలపై ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఈ బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధుల ప్రస్థావన ఎక్కడా కనిపించ లేదు. దీంతో బీజేపీని గెలిపించిన నేతలు నిధులు రాబట్టలేక పోయారన్న టాక్ వినిపిస్తోంది.

నిరుద్యోగుల సమస్య పరిష్కరించే వారికి మా మద్దతు

● పట్ట భద్రుల సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు

నార్నూర్, ఫిబ్రవరి 01 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికలు వస్తే తప్ప నిరుద్యోగులను రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని పట్టభద్రుల సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు సచిన్ దుర్గే ఆరోపించారు. శనివారం నార్నూర్ మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్ట భద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిరుద్యోగ యువత గురించి అసెంబ్లీ శాసన మండలిలో మాట్లాడి, ప్రభుత్వానికి విన్నవించి సమస్యల పరిష్కారం చేసే అభ్యర్థికి తమ పూర్తి మద్దతు ప్రకటిస్తామని పేర్కొన్నారు. యువతకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి ఉద్యోగ ఉపాధి విషయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వెంటనే నియమకాలు చేపట్టాలన్నారు. ప్రతి నిరుద్యోగ యువతకు నెలకు రూ.10 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు రమేష్, సిద్ధార్థ్, రవికాంత్, కిరణ్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ఇచ్చోడ, జనవరి, 1 (ఆంధ్రజ్యోతి) : ఇచ్చోడ మండల భవన నిర్మాణ కార్మికసంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులు రవి, అన్నెల లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యదర్శిగా మసిదు రాజు, కోశాధికారిగా గొలుసుల రాము, సభ్యులు రాజ్‌కుమార్, గురవయ్య, సంజీవ్, సలీం, రౌఫ్, రవిలను ఎన్నుకున్నారు.

వనంలో జనమే జనం

● కేస్లాపూర్ నాగోబా జాతరకు భారీగా తరలివచ్చిన భక్తులు
● బేతాల్, మండగాజలింగ్, సంప్రదాయ పూజలు



గోవాడ్ వద్దకు వస్తున్న మెస్రం వంశీయులు



కర్రసాము ఆడుతున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆదివాసుల ఆరాధ్యదైవం నాగోబాను దర్శించుకునేందుకు శనివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీసంఖ్యలో తరలివచ్చారు. వేలాదిమంది భక్తులు తరలిరావడంతో ఆలయంతో పాటు జాతర పరిసరాలు కిక్కిరిశాయి. దర్శనం కోసం గంటల తరబడి బారులు తీరారు. అనంతరం దర్శించుకొని ప్రత్యేకపూజలు చేశారు. దారి పొడవునా వెలిసిన దుకాణాలు, హోటళ్ల వద్ద వివిధ రకాల వస్తువులు, తినుబండారాలు కొనుగోలు చేస్తూ ప్రజలు సందడి చేశారు. రం గుల రాట్నాలు, వెలిసిన హోటళ్లు, దుకాణాల్లో జనం రద్దీ కనిపించింది. ఎటుచూ సిన ప్రజలు జాతరకు తరలివస్తూ కనిపించారు.

● బేతాల్, మండగాజలింగ్ పూజలు

ముందుగా నాగోబాతో పాటు సతీదేవతలను దర్శించుకున్న భక్తులు వేసిన కానుకలను మెస్రం వంశీయులు కితల వారీగా పంచుకున్నారు. అనంతరం ప్రసాదంతోపాటు కొబ్బరికాయలు, మట్టికుండలు మెస్రం వంశీ యులతో పాటు వారి దగ్గరి బంధువులకు పం పిణీ చేశారు. మహాపూజలకు వాడిన మట్టికుం డలను 22 కితలకు చెందిన వారికి పంపిణీ చేశారు. ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ పటేల్ కాగడాలను వెలిగించి, బేతాల్ పూజలను ప్రారంభించారు. బేతాల్‌దేవత పేరిట సంప్ర దాయ పద్ధతిలో నెలపై తంబాకు వేసి అక్కడి నుంచి నాగోబాను మొక్కుకున్నారు. అనంతరం ఆదివాసీ సంప్రదాయ వాయిద్యాలు వాయిస్తూ నృత్యాలు చేస్తూ గోవాడ్‌కు చేరుకున్నారు. గోవాడ్ ఎదుట మెస్రం వంశీయుల మహిళల ఆధ్వర్యంలో మెస్రం వెంకట్‌రావ్‌పటేల్ చేతి కర్రతో పాటు పెద్దల పాదాలను నీటితో కడిగారు. మహిళలు, మెస్రం వంశీయులు వేర్వేరుగా మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం వారి వాయిద్యాలు వాయిస్తూ మహిళలు, పురుషులు వేర్వేరుగా బేతాల్ నృత్యాలు చేసి అక్కడి నుంచి నాగోబాను దర్శించుకున్నారు. అనంతరం నాగోబా పూజలతోపాటు సంప్రదాయ పూజలకు ముగింపు పలికారు. సాయంత్రం కేస్లాపూర్ నుంచి కుటుంబ సమేతంగా ఎడ్లబండ్లలో ఉట్నూర్ మండలంలోని శ్యామ్‌పూర్‌లోని భుడుందేవు జాతర కోసం బయల్దేరనున్నట్లు మెస్రం వంశీయుల పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో మెస్రం చిన్నుపటేల్, బాజీరావ్, లింబారావ్‌పటేల్, కటోడ కోసు, కటోడ కోసేరావ్, కటోడ హనుమంత్‌రావ్, మెస్రం దాదారావ్, మెస్రం తిరుపతి, మెస్రం గణపతి పాల్గొన్నారు.

ఇచ్చిన అప్పులు రాక.. కుటుంబం ఆత్మహత్యాయత్నం

● ఇద్దరి మృతి.. మరొకరు సీరియస్ ● జిల్లాలో విషాదం



మృతుడు రాకేష్ (ఫైల్), మృతురాలు స్పందన

తలమడుగు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : తెలిసిన వ్యక్తి కావడంతో నమ్మి అతనికి ఏకంగా రూ. 60లక్షలు ఇచ్చాడో వ్యక్తి. కానీ ఏళ్లు గడుస్తున్నా.. డబ్బులు మాత్రం తిరిగి ఇవ్వడం లేదు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన ఆ కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. అందులో ఇద్దరు మృతి చెందగా, మరొకరు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న విషాద ఘటన ఆదిలాబాద్ జిల్లాలో శనివారం చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. జిల్లాలోని తాంసి మండలం కప్పర్ల గ్రామానికి ఆకుల రాకేష్ (34) తనకున్న 10 ఎకరాల్లో వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. అలాగే గ్రామంలోనే ఫర్టిలైజర్ షాప్ కూడా నడిపిస్తున్నాడు. ఇతనికి భార్య ఆకుల లావణ్య, కూతురు ప్రసన్న ఉన్నారు. అలాగే మరదలు స్పందన (19)కు తల్లిదండ్రులు లేకపోవడంతో చిన్నప్పటి నుంచి రాకేష్ ఇంట్లోనే ఉంటోంది. రాకేష్ తాంసి మండలంలోని హస్నాపూర్‌కు చెందిన వ్యాపారి రాకేందర్‌కు గత నాలుగేళ్ల క్రితం అప్పుగా రూ. 60లక్షలు ఇచ్చాడు. సంవత్సరంలోగా తీసుకున్న డబ్బును తిరిగి ఇస్తానని చెప్పిన రాకేందర్.. ఎంతకూ తిరిగి ఇవ్వలేదు. దీంతో రాకేష్ తన డబ్బులు ఇవ్వాలని చాలా సార్లు అడిగాడు. కానీ అతని వద్ద నుంచి సరైన స్పందన లేదు. ఇంటికి వెళ్లి అడిగితే.. తప్పించుకుంటున్నాడు గానీ తీసుకున్న అప్పులు మాత్రం ఇవ్వడం లేదు. ఈ క్రమంలోనే రాకేష్ గ్రామానికి చెందిన కొందరి వద్ద రూ. లక్షల్లో అప్పులు చేశాడు. దీంతో కుటుంబంలో గొడవలు మొదలయ్యాయి. ఓ వైపు రాకేష్ వద్ద చిల్లిగవ్వ లేకపోవడం.. మరోవైపు రాకేందర్ తీసుకున్న రూ. 60లక్షలు ఎంతకూ ఇవ్వకపోవడం.. ఇంకోవైపు రాకేష్‌కు అప్పులు ఇచ్చిన వారు తిరిగి ఇవ్వాలని వేధించడం.. వెరసి తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. తాను కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగానే శనివారం సాయంత్రం తలమడుగు మండలం ఉమ్మం గ్రామ శివారులో ఉన్న తన పొలం వద్దకు రాకేష్, అతని భార్య లావణ్య, కూతురు ప్రసన్న, మరదలు స్పందన వెళ్లారు. ఈ తమ వెంట తెచ్చుకున్న పురుగుల మందును రాకేశ్, లావణ్య, స్పందనలు తాగారు. తన కూతురికి మాత్రం తాగించలేదు. పురుగుల మందు తాగిన ముగ్గురూ అపస్మారక స్థితిలోకి వెళ్లారు. పొలం పక్కనే గల కొందరు రైతులు వీరిని గమనించి వెంటనే 108కి సమాచారం అందించి.. చికిత్స నిమిత్తం ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో రాకేశ్, అతని మరదలు స్పందన మృతి చెందారు. భార్య లావణ్య కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతోంది. సమాచారం అందుకున్న ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి, సీఐ ఫణిందర్ వెంటనే రిమ్స్‌కు వెళ్లి.. వివరాలు సేకరించారు. విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఆదిలాబాద్ మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న రిమ్స్‌కు వెళ్లి మృతదేహాలను పరిశీలించారు. వారి కుటుంబసభ్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కాగా.. రాకేష్ మేన మరదలు రిమ్స్ ఆసుపత్రిలోనే ప్రస్తుతం ఏఎన్‌ఎంగా శిక్షణ తీసుకుంటోంది. విషయం తెలుసుకున్న బంధువులు, స్నేహితులు ఆమె మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజమ్మ తెలిపారు.

కొట్టాల పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

బోథ్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొట్టాల పోచమ్మ విగ్రహ ప్రతి ష్ఠాపన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. మూడురోజుల నుంచి ప్రారంభమైన కార్యక్రమం చివరి రోజు శనివారం విగ్రహ ప్రతిష్ఠాపన వేద పండితుల సమక్షంలో ప్రతిష్ఠాపన గావించి ప్రాణ ప్రతిష్ఠ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వేద పండితులు బ్రహ్మ ముహూర్తంలో పోచమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠాపించారు. వచ్చిన భక్తులకు అన్న దాన కార్యక్రమాన్ని నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పురస్కరించుకొని స్థానిక శాసనసభ్యులు జాదవ్ అనిల్ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ రాజనాల సంధ్యారాణి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాజీ సర్పంచ్ల సంఘం అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, బోథ్ పట్టణ మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్‌తో పాటు సోనాల మాజీ సర్పంచ్ సి. సదానందం, పట్టణ అధ్యక్షులు అల్లకొండ ప్రశాంత్, రైతు అధ్యక్షులు బొడ్డు శ్రీనివాస్‌తో పాటు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. మండలంలోని కౌఠా(బీ) గ్రామంలో వెండి సోమేశ్వర్ బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు నిర్వహించిన రుద్రాభిషేకం కార్యక్రమంలో శనివారం స్థానిక శాసనసభ్యులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ స్థలం కబ్జాకు గురికానివ్వం

● చైర్మన్ లింగయ్య

బోథ్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని డీసీఎంఎస్ స్థలం కబ్జాకు గురికాకుండా తగుచర్యలు తీసుకుంటామని డీసీఎంఎస్ చైర్మన్ లింగయ్య పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో డీసీఎంఎస్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీసీఎంఎస్‌కు చెందిన స్థలంలో షెడ్డు నిర్మాణం జరిగిందని అయితే ఈ విషయమై గతంలో పోలీస్‌స్టేషన్‌తో పాటు గ్రామపంచాయతీ వారికి వివరించడం జరిగిందని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ వారు ఓ ప్రైవేట్ వ్యక్తి స్థలంలో షెడ్డును నిర్మించుకుంటే ఆ షెడ్డు కోసం ఇంటి నెంబర్ కేటాయించడం జరిగిందని అయితే షెడ్యూల్ నిర్మించిన వ్యక్తి తమ స్థలంలో షెడ్డు వేసి అదే ఇంటి నెంబర్ పైన పన్ను చెల్లించడం జరిగిందని పేర్కొన్నారు. డీసీఎంఎస్ స్థలం ఆక్రమణ విషయమై జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేయడం జరుగుతుందని చైర్మన్ పేర్కొన్నారు. ఆయన వెంట డీసీఎంఎస్ మేనేజర్ ప్రమోద్‌కుమార్, సహకార సంఘం డైరెక్టర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జి. రాజు యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మహమ్మద్‌లు ఉన్నారు.

మార్కండేయ ఆలయంలో పూజలు

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 01 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని హమాలీ వాడ శ్రీ భక్త మార్కం డేయ మందిరం, భీరంసరి గ్రామంలోని శ్రీ మార్కండేయ మందిరలను శనివారం తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజరులు అర్చన నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు మాటేటి రాజు, సామల రాజన్న, దాసరి ప్రశాంత్, మెరుగు సాయికృష్ణ, రవి, సామల శేఖర్, బత్తుల రాజేష్, ఆలయ సభ్యులు హన్మాండ్లు, చిన్న ఈరన్న, నీలం రామన్న, పెద్దఈరన్న, ఎలిగెటి నర్సింగ్, మల్లయ్య, సంజయ్, సీనియర్ నాయకులు నలిమే నవీన్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, టౌన్ వైస్ ప్రెసిడెంట్ రంజిత్ రెడ్డి, వెంకటేష్, కుర్ర నరేష్, ఉదయ్, మల్లయ్య పాల్గొన్నారు.

చించోలిలో భగవాన్ బాబామూర్తి ప్రాణప్రతిష్ఠ

ఇచ్చోడ, ఫిబ్రవరి, 1 (ఆంధ్రజ్యోతి): భజన సంకీర్తనలతో ఇచ్చోడ నుంచి చించోలి వరకు హరిఓం నామస్మరణతో మార్మోగింది. మహోత్సర కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సైతం భజన చేస్తూ పాదయాత్రలో పాల్గొన్నారు. అనంతరం పాదయాత్ర చేసిన భక్తులకు చిన్నారులకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్, పండు, తాగునీటిని అందించి భక్తుల వెంట ర్యాలీలో పాల్గొన్నారు. కలశారోహణ కార్యక్రమానికి నానామహరాజ్ జొల్కర్, దర్యావ్‌సింగ్ మహరాజ్, ప్రేమ్‌సింగ్ మహరాజ్, భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు.

కుంభమేళాలో తప్పిపోయిన నలుగురు అక్కాచెల్లెళ్లు క్షేమం

ఖానాపూర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహిస్తున్న కుంభమేళాలో పుణ్యస్నానాన్ని ఆచరించేందుకు వెళ్లి తప్పిపోయిన ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మహిళలు శనివారం క్షేమం గా ఇంటికి చేరారు. వివరాల్లోకి వెళ్తే కుటుంబ సభ్యులు తెలిపిన కథనం ప్రకారం... నిర్మల్ జిల్లా కడెం మండలం కల్లెడ గ్రామానికి చెందిన ఏనుగుల బుచ్చవ్వ, పెద్ద బెల్లాల్ ఉప్పరిగూడెం నకు చెందిన బెల్లపు సత్తవ్వ, జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన వీర్ల నర్సవ్వ, ఆది రాజవ్వ అనే నలుగురు అక్కాచెల్లెళ్లు గత నెల 28వ తేదీన జగిత్యాల నుంచి బయలుదేరిన ఓ ట్రావెలర్‌లో మరో 8 మందితో కలిసి ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహిస్తున్న కుంభమేళాకు బయలుదేరి వెళ్లారు. గతనెల 29వ తేదీన సాయంత్రానికి వీరంతా కుంభమేళా ప్రాం తానికి చేరుకొని అదే రోజు త్రివేణి సంఘంలో పుణ్యస్నానాన్ని ఆచరించేందుకు బయలుదేరి వెళ్లారు. కుంభమేళా ప్రాంతంలో భారీగా జన సందోహం ఉండడంతో నలుగురు అక్కాచెల్లెళ్లు ఒకవైపు, వారితో కలిసి వెళ్లిన మరో ఎనిమిది మంది యాత్రికులు మరోవైపు విడిపోయారు. దీంతో సదరు నలుగురు మహిళల వద్ద ఫోన్ కూడా లేకపోవడంతో వారు ఆచూకీ దొరకకుండా పోయింది. గతనెల 29వ తేదీ నుంచి శనివారం మధ్యాహ్నం వరకు ప్రయాగ్‌రాజ్‌లో తోటి ప్రయాణికులతో పాటు ఇంటి నుంచి సైతం వెళ్లిన ఐదుగురు సభ్యుల బృందం వీరి కోసం తీవ్రంగా వెతికారు. ఆచూకీ తెలియకపోవడంతో అంతా ఆందోళన చెందారు. కానీ ఉత్తరప్రదేశ్ పోలీసుల సహకారంతో ప్రయాగ్‌రాజ్‌లో తప్పిపోయిన నలుగురు మహిళలు క్షేమంగా శనివారం మధ్యాహ్నం ఇంటికి చేరారు. తోటి యాత్రికులతో విడిపోయి ఆందోళన చెందుతున్న ఏనుగుల బుచ్చవ్వ, బెల్లపు సత్తవ్వ, వీర్ల నర్సవ్వ, ఆది రాజవ్వ అనే నలుగురు మహిళలు అక్కడ పోలీసులు నిర్వహిస్తున్న హెల్ప్‌డెస్క్ వద్దకు వెళ్లారు. అక్కడికి వెళ్లి జరిగిన విషయాన్ని చెప్పి తాము పుణ్యస్నానానికి వెళ్లి తమ తోటి ప్రయాణికులతో విడిపోయామని తెలిపారు. తమ వారి ఆచూకీ తెలుపాలని ఆందోళన చెందుతున్న మహిళలను ఓదార్చి అక్కడి పోలీసులు వరంగల్ వరకు రైల్లో పంపించారు. వరంగల్ వరకు రైల్లో వచ్చిన నలుగురు అక్కాచెల్లెళ్లు శనివారం శనివారం మధ్యాహ్నానికి జగిత్యాలకు చేరుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో తప్పిపోయిన నలుగురు జగిత్యాలకు క్షేమంగా చేరడంతో అటు జగిత్యాల జిల్లా కేంద్రంతో పాటు ఇటు నిర్మల్ జిల్లా కడెం మండలంలోని రెండు ఊర్లలో వారి బంధువులంతా ఊపిరి పీల్చుకున్నారు. మొత్తానికి ఈ నలుగురు మహిళలు తప్పిపోయిన కథ సుఖాంతం అవ్వడంతో వీరిని వెతికేం దుకు వెళ్లిన కుటుంబసభ్యుల బృందం సైతం ప్రయాగ్‌రాజ్‌లో పుణ్యస్నానాలను ఆచరించి తిరుగు ప్రయాణమైనట్లు తెలిపారు. వీరిని వెతికేందుకు జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ అక్కడి సహాయక బృందాలతో మాట్లాడి వారి సహాయ సహకారాలను అందించారని బాధిత కుటుంబసభ్యులు పేర్కొన్నారు.



క్షేమంగా ఇంటికి చేరిన నలుగురు అక్కాచెల్లెళ్లు

బాలల హక్కుల గురించి అవగాహన

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు బాలల హక్కుల గురించి అవగాహన కలిగి ఉండాలని జీసీడీవో సలోమి కరుణ అన్నారు. శనివారం పట్టణంలోని కేజీబీవీ పాఠశాలలో బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమం 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా విద్యార్థులకు బాల్య వివాహాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీపీవో మురళి, కేజీబీవీ ఎస్‌వో సుజాత, మిషన్ శక్తి జెండర్ స్పెషలిస్ట్ జ్యోతి, మౌనిక, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది, విద్యార్థినిలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మోకు దెబ్బ ఆధ్వర్యంలో పట్టణంలోని మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్‌కు సన్మానం చేసినట్లు అధ్యక్షులు అమరవేణి నర్సాగౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గోపి గౌడ్, రాష్ట్ర కమిటీ సభ్యులు రాజేందర్ గౌడ్, బాలా గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బద్దిపోచమ్మ విగ్రహా ప్రతిష్ఠాపనోత్సవాలు

భైంసా, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలోని భట్టిగల్లిలో శనివారం శ్రీ బద్దిపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు కొనసాగనున్న ప్రతిష్ఠాపన మహోత్సవాలలో భాగంగా తొలిరోజు మహాలక్ష్మీ మందిరం నుంచి ప్రతిష్ఠించే అమ్మవారి విగ్రహాన్ని శ్రీ బద్దిపోచమ్మ ఆలయం వరకు శోభాయాత్రగా తీసుకువెళ్లారు. శ్రీ బద్దిపోచమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్రలో భట్టిగల్లి, గణేష్‌నగర్ కాలనీవాసులతో పాటు పట్టణ పరిధిలోని వివిధ ప్రాంతాల వాసులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. మహిళా భక్తులు ముందుగా తమ తమ నివాసగృహాల నుంచి శ్రీ బద్దిపోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి భాజభజంత్రీల మధ్య మహాలక్ష్మీ మందిరానికి శోభాయాత్రగా చేరుకున్నారు. ఇక్కడ ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారి విగ్రహాన్ని శోభాయమానంగా అలంకరించిన ప్రత్యేక వాహనంపై శ్రీ బద్దిపోచమ్మ ఆలయం వరకు శోభాయాత్ర తీసుకువెళ్లారు. భక్తుల కోలాహలం మధ్య శోభాయాత్ర ఆద్యాంతం సంప్రదాయబద్ధంగా కొనసాగింది. శోభాయాత్ర ముందు వరుసలో శ్రీ సరస్వతీ శిశు మందిర్ విద్యార్థులు ఘోష్ నిర్వహిస్తూ అమ్మవారి విగ్రహానికి స్వాగత కార్యక్రమాలు చేపట్టారు. తదుపరి భట్టిగల్లి, గణేష్‌నగర్ భజన మండలి లు భజనలు చేస్తూ కోలాటాలు వేస్తూ, నృత్యాలు చేపడుతూ శోభాయాత్రలో పాల్గొన్నారు. మహిళామూర్తులు మంగళహారతులతో గేయాల ఆలపిస్తూ శోభాయాత్రలో భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవానికి పురస్కరించుకొని భట్టిగల్లి జన సంద్రంగా మారిపోయింది.



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

చించాలలో ముగిసిన అఖండ హరినామ సప్తాహం



హాజరైన భక్తులు

ముథోల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండ లంలోని చించాలలో గల హనుమాన్ మంది రంలో వారం రోజుల నుంచి కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహం శనివారం ముగిసింది. ముగింపు సందర్భంగా శ్రీ నారా యణ మహరాజ్ యాతల్‌కర్ కాల కీర్తన నిర్వ హించారు. ప్రతి మానవుడు జీవిత గమనంలో ఆధ్యాత్మిక చింతనతోనే మానవ జన్మ స్వార్థక మవుతుందన్నారు. భక్తిభావంతో జీవితం ప్రశాంతంగా ఉంటుందని తెలిపారు. ఈ సం దర్భంగా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ముథోల్ ఎస్సై సంజీవ్ ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా ఎస్సైని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. అధికసంఖ్యలో మహిళలు, భక్తులు, భజన మండలి సభ్యులు పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వ హించారు. మహరాజులకు, భజన మండలి సభ్యులకు, నాయకులకు గ్రామస్తుల ఆధ్వర్యం లో ఘనంగా సన్మానించారు. సప్తాహ ముగిం పు సందర్భంగా జాతర కొనసాగింది. జాతరకు వచ్చిన భక్తులకు గ్రామస్తులు భారీ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో విఠల్, శంకర్, దర్మన్న, పెద్ద రాజేశ్వర్, హన్మాండ్లు, పండరి, శివాజీ, సత్యనారాయణ, బి.లస్మన్న, లక్ష్మీకాంత్, లచ్చారాం, భూమన్న, సాయిలు, గ్రామస్తులు, తదితరులున్నారు.



జాతరలో కొనుగోలు చేస్తున్న భక్తులు

ఘనంగా సాయిబాబా జాతర

● భారీగా తరలివచ్చిన జనం
● కన్నుల పండువగా లక్ష్మీనారాయణుల కల్యాణం



సాయిబాబా విగ్రహానికి అభిషేకం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే



కల్యాణ ఘట్టాన్ని తిలకిస్తున్న భక్తులు

ఖానాపూర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఓం సాయి... శ్రీ సాయి... జయ జయ సాయి... అనే నామస్మరణతో ఖానాపూర్ పట్టణం మార్మోగింది. పట్టణంలోని శ్రీ వీరాంజనేయ శివసాయి సమాజ్ 28వ వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా చివరి రోజు శనివారం ఆలయ ఆవరణలో నిర్వహించిన జాతర కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచే కాకుండా పక్క జిల్లాలైన నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్ నుంచి సైతం భక్తజనం భారీగా తరలివచ్చారు. ఆలయ వార్షికోత్సవ వేడుకల ముగింపు ఉత్స వాల్లో భాగంగా నిర్వహించిన జాతర కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆలయంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్, మాజీ ఎమ్మెల్యే అజ్మీరా, రేఖానాయక్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్యాజాన్సన్‌నాయక్, నిర్మల్ అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ అంకం రాజేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యనారాయణ, ఖానాపూర్ మాజీసర్పంచ్ ఆకుల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్య క్షులు దొనికెని దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, మాజీజడ్పీటీసీ రాథోడ్ రాము నాయక్, మాజీమార్కెట్ కమిటీ చైర్మన్లు కల్వకుంట్ల నారాయణ, సాగిలక్ష్మణ్ రావు, కడార్ల గంగ నర్సయ్య, సహా పలువురు ప్రముఖులు ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. జాతరను పుర స్కరించుకొని ఏర్పాటు చేసిన మహా అన్నదానానికి విశేష స్పందన వచ్చింది. మహా అన్నదానానికి 40 క్వింటాళ్ల బియ్యాన్ని ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ విరాళంగా అందజే సినట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు అంకం రాజేందర్ తెలిపారు. శ్రీ వీరాంజనేయ శివసాం ఇ సమాజ్ ఆలయ ముగింపు కార్యక్రమం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో లోకకల్యా ణార్థం శివపార్వతుల కల్యాణం, లక్ష్మీ నారాయ ణుల కల్యాణం అత్యంతవైభవంగా నిర్వహిం చారు. ఈ కల్యాణ ఘట్టాన్ని తిలకించేందుకు ఆలయ ప్రాంగణంలో భక్తులు భారీగా వచ్చారు. కల్యాణ అనంతరం నిర్వహించిన సాంస్కృ తిక కార్యక్రమాలు అలరించాయి.

ఒకరిపై కేసు నమోదు

కుంటాల, ఫిబ్రవరి, 1: (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలంలోని సూర్యాపూర్ గ్రామానికి చెందిన భోజన్న అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై భాస్కరచారి తెలిపారు ఇందుకు సంబంధించిన వివ రాల ప్రకారం భోజన్న మద్యం సేవించి స్థానిక పంచాయతీ సెక్రటరీ విధులకు ఆటంకం కలిగించాడని షెడ్డు నిర్మాణ విషయంలో గొడవ పడుతూ సెక్రటరీ విధులు నిర్వహించకుండా ఇష్టారీతిన బూతులు తిడుతూ భయభ్రాంతులకు గురిచేయడం వలన సెక్రటరీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎవరైనా ఉద్యోగులు తప్పు చేస్తే వారి ఉన్నత స్థాయి ఉద్యోగులకు ఫిర్యాదు చేయాలన్నారు.

స్కీమ్ వర్కర్స్‌కు తీవ్ర అన్యాయం : సీఐటీయూ

లోకేశ్వరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూనియన్ బడ్జెట్ 2025-26 దేశంలోని పేద, మధ్య తరగతి వర్గాలకు తీవ్ర అన్యాయం చేస్తోంది. ముఖ్యంగా స్కీమ్ వర్కర్స్ హక్కులను నిర్లక్ష్యం చేస్తూ, కార్మిక సంక్షేమ నిధులను గణనీయంగా తగ్గించడం పట్ల సీఐటీయూ జిల్లా నాయకుడు డి. పోశెట్టి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. లోకేశ్వరం మండలంలో స్కీమ్ వర్కర్లతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ... అంగన్‌వాడీ, ఆశా, మిడ్ - డే మిల్ వర్కర్స్ వంటి లక్షలాది కార్మికులు తక్కువ వేతనాలపై ఆధారపడి దేశ ప్రజలకు కీలకమైన సేవలను అందిస్తున్నారని, కానీ వారి పారితోషకాలను పెంచడంలో కేంద్రం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కార్మిక వర్గాల పట్ల తన నిర్లక్ష్యాన్ని మరోసారి ప్రదర్శించిందన్నారు.

మాయ మాటలు చెప్పి బంగారం చోరీ

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 01 (ఆంధ్రజ్యోతి) : మాయమాటలు నమ్మి ఓ మహిళ రెండున్నర తులాల బంగారం పోగొట్టుకుంది. పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన బి.అనసూయ శనివారం మధ్యాహ్నం తన కొత్త ఇంటి నిర్మాణానికి నీరు పడుతుంది. ఆ సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ఆమెతో మాటలు కలిపాడు. లక్కీడ్రాలో సెలెక్ట్ అయ్యావని నమ్మించాడు. దీంతో మహిళ రెండున్నర తులాల బంగారు చైన్‌ను అతనికి ఇచ్చింది. అతను షాపులోకి వెళ్లి వస్తానంటూ చెప్పి పరారయ్యాడు. మోసపోయానని గ్రహించిన మహిళ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.



మళ్లీ.. నిరాశే..!



- కేంద్ర బడ్జెట్‌లో కనిపించని జిల్లా ప్రస్తావన
- ఆదిలాబాద్ - ఆర్మూర్ రైల్వేలైన్ ఊసే లేదు
- సర్కారు బడులకు సాంకేతిక సాకారం
- సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణకు దక్కని అవకాశం
- ఎయిర్‌పోర్టు నిర్మాణంపై ఆవిరవుతున్న ఆశలు
- కిసాన్‌కార్డుల పరిమితి పెంపుతో రైతన్నలకు మద్దతు
- ఎన్నికల్లో అండగా నిలిచినా ప్రయోజనం లేకపాయే
- కేంద్ర బడ్జెట్‌పై జిల్లా వాసుల్లో బిన్నాభిప్రాయాలు

ఆదిలాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 2025-26 సాధారణ బడ్జెట్‌తో జిల్లా వాసులకు మళ్లీ నిరాశే మిగిలింది. బడ్జెట్ కేటాయింపుల్లో ప్రత్యేకంగా జిల్లా ప్రస్తావన ఎక్కడా కనిపించ లేదు. శనివారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన సాధారణ బడ్జెట్ జిల్లా వాసులను మెప్పించ లేకపోయిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తం రూ.50,65,345 కోట్ల బడ్జెట్‌లో జిల్లాకు ఆశించిన స్థాయిలో కేటాయింపులు జరుగలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా దీర్ఘకాలిక సమస్యల జోలికి వెళ్లినట్లు కనిపించడం లేదు. వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.1,71,437 కోట్లు కేటాయించగా, విద్యకు రూ.1,28,650 కోట్లు, వైద్యం రూ. 98,311 కోట్లు, పట్టణ అభివృద్ధి రూ.96,777 కోట్లు, విద్యుత్ రంగానికి రూ.81,174 కోట్లు, గ్రామీణ అభివృద్ధికి భారీగా రూ.2,66,817 కోట్లను కేటాయించారు. ముఖ్యంగా వేతన జీవులకు భారీ ఊరట కలిగింది. రూ.12లక్షల వరకు పన్ను మినహాయింపును ఇచ్చారు. గతంలో ఉన్న రూ.7లక్షల పరిమితిని రూ.12లక్షల వరకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. అయితే జిల్లాలో ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని ప్రధాన సమ స్యలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించలేక పోయిందన్న చర్చకు దారి తీస్తోంది. ఈ సారి కేంద్ర బడ్జెట్‌లో జిల్లా అభివృద్ధికి నిధుల కేటాయింపు ఉంటుందని అందరూ భావించారు. అయినా నిర్మలమ్మ పద్దు జిల్లా వాసులను నిరాశ పరిచిందని వాపోతున్నారు. కేంద్ర సాధారణ బడ్జెట్‌పై జిల్లావాసుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రైల్వేలైన్‌కు మొండి చెయ్యే..

గత ఐదేళ్లుగా ఆదిలాబాద్ - ఆర్మూర్ వయా పటాన్ చెరువు రైల్వేలైన్ నిర్మాణం పనుల కోసం జిల్లా వాసులకు ఎదురు చూపులు తప్పడం లేదు. ఇదిగో అదిగో అంటూ కాలం గడపడంతో రైల్వేలైన్ కలగానే మారుతోంది. ఈ రైల్వేలైన్ పనులు పూర్తయితే రవాణా సౌకర్యం మెరుగుపడి హైదరాబాద్‌కు మరింత దూరభారం తగ్గనుంది. ఈ సారి కూడా బడ్జెట్‌లో రైల్వేలైన్ ఊసే లేదు. గత ఐదేళ్ల క్రితం బడ్జెట్‌లో రూ.2700 కోట్లను కేటాయిస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో సగ భాగం రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుందని కేంద్రం ప్రకటించింది. దీంతో కేంద్ర రాష్ట్రాల మధ్య సఖ్యత లేక పోవడంతో నిధుల కేటాయింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతునే వస్తోంది. కేంద్ర ప్రభుత్వం కూడా అంతగా పట్టించుకోక పోవడంతో బడ్జెట్ కేటాయింపులు జరగడం లేదని తెలుస్తోంది. గతంలో మాజీ ఎంపీ సోయం బాపురావ్ పలుమార్లు ఢిల్లీ పెద్దలను కలిసి రైల్వే పనులను ప్రారంభించాలని కోరారు. ఇటీవల ఎంపీ గోడం నగేష్ రైల్వే ఉన్నతాధికారులను కలిసి విన్నవించినా ఫలితం లేక పోయిందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

బడికి డిజిటల్ సేవలు..

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బ్రాడ్ బ్యాండ్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు బడ్జెట్‌లో నిధులను కేటాయించారు. ఇప్పటికే గ్రామాల్లో గత ప్రభుత్వం అన్ని పంచాయతీల్లో ఈ - సేవలు అందించేందుకు నెట్‌వర్క్ సౌకర్యాన్ని కల్పించింది. ఇకపై ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా బ్రాడ్ బ్యాండ్ సేవలు అందనున్నాయి. విద్యారంగంలో డిజిటల్ సేవలను అందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో డిజిటల్ బోధన వైపు అడుగులు వేసే అవకాశం కనిపిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 1,441 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వీటి పరిధిలో లక్షా 34వేల 389 మంది విద్యార్థులు వివిధ తరగతుల్లో చదువుకుంటున్నారు. సర్కారు బడులకు ఆన్‌లైన్ సేవలను అందించి ప్రపంచ స్థాయి విద్య అవకాశాలను అందుబాటులోకి తీసుకు రానున్నారు.

సీసీఐ పునరుద్ధరణ కష్టమే..

నష్టాల్లో కూరుకుపోయి మూతబడిన సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణ ఇక కష్టమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నా యి. ఏళ్లు గడుస్తున్నా ఏ ప్రభుత్వం పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఎన్నికల సమయంలోనే సీసీఐ పునరుద్ధరణ తెరపైకి వస్తున్నా నేతలకు చిత్తశుద్ధి లేకపోవడంతో పరిశ్రమ ప్రారంభానికి నోచుకోవడం లేదు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో రకాల ప్రయత్నాలు చేసినా ప్రయోజనం కనిపించ లేదు. అలాగే సీసీఐ పునరుద్ధరణకు గతంలో అఖిల పక్షం నేతలు సాధన సమితి పేరిట పోరా టం చేశారు. అయితే కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో మాత్రం సీసీఐ పరిశ్రమకు ఎలాంటి నిధుల కేటాయింపులు జరుగలేదు. దీంతో ఈ సారి కూడా నిరాశే మిగిలింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేక పోవడంతో కార్మిక కుటుంబాలు ఆందోళనకు గురవుతున్నాయి.

గాలిమోటర్‌పై సన్నగిల్లుతున్న ఆశలు

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం డిమాండ్లు వస్తున్నాయి. కానీ కేంద్ర ప్రభుత్వం అంతగా పట్టించుకున్నట్లు కనిపించడం లేదు. ప్రతీసారి బడ్జెట్‌లో మొండి చెయ్యే చూపుతోంది. దీంతో జిల్లావాసుల గాలిమోటార్ ఆశలు సన్నగిల్లుతున్నాయి. ఈ సారి కూడా బడ్జెట్‌లో ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు ప్రస్తావన ప్రత్యేకంగా కనిపించ లేదు. హుడాన్ పథకం కింద దేశవ్యాప్తగా 120 ఎయిర్ పోర్టులను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా జిల్లాకు చోటు దక్కుతుందో లేదోనన్న ఆందోళన కనిపిస్తోంది. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి జిల్లాలో అన్ని రకాల అవకాశాలు ఉన్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడంపై జిల్లా వాసులు మండిపడుతున్నారు. ఇదిగో అదిగో

(మిగతా 8వ పేజీలో)

అన్ని రంగాలకు ప్రాధాన్యం

• గోడం నగేష్, (ఎంపీ, ఆదిలాబాద్)



కేంద్ర ప్రభుత్వ సాధారణ బడ్జెట్‌లో అన్ని రంగాలకు ప్రాధాన్యత దక్కింది. ముఖ్యంగా వ్యవసాయం, గ్రామీణ రంగానికి భారీగా నిధుల కేటాయింపు జరిగింది. ఇప్పటికే ఆర్మూర్-ఆదిలాబాద్ రైల్వేలైన్ సర్వే పనులు దాదాపుగా పూర్తయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే పనుల్లో జాప్యం జరుగుతోంది. సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణ కోసం ప్రయత్నం చేస్తున్నాం. ముఖ్యం గా సర్కారు బడుల్లో డిజిటల్ సేవలను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించడం హర్షణీయం. రైతులకు లబ్ధి చేకూరే విధంగా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయి.

బడ్జెట్ ఏ మాత్రం బాగోలేదు

• జోగు రామన్న, (మాజీ మంత్రి, ఆదిలాబాద్)



కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సాధారణ బడ్జెట్ ఏ మాత్రం బాగోలేదు. పూర్తిగా అంకెల గారడిగానే కనిపిస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న ఏ ఒక్క సమస్యకు పరిష్కారాన్ని చూపినట్లు కనిపించ లేదు. స్థానిక ఎమ్మెల్యే పాయల శంకర్, ఎంపీ గోడం నగేష్‌లు నిధులను రాబట్టడంలో పూర్తిగా విఫలమయ్యారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజలకు వెంటనే క్షమాపణలు చెప్పాలి. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉన్నా ప్రయోజనం లేకుండా పోయింది. నేతల అసమర్థతతోనే బడ్జెట్‌లో జిల్లాకు కేటాయింపులు జరుగలేదు.

ఎంపీ, ఎమ్మెల్యేలు ఫెయిల్యూర్

• కంది శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజక వర్గ ఇన్‌చార్జీ, ఆదిలాబాద్



కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు నిధులు రాబట్టడంలో ఎమ్మెల్యే పాయల శంకర్, ఎంపీ గోడం నగేష్ పూర్తిగా ఫెయిల్యూర్ అయ్యారు. ఏళ్ల తరబడి సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణ, ఎయిర్‌పోర్టు నిర్మాణం జరుగడం లేదు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే జిల్లా సమస్యలన్నీ పరిష్కారమవుతాయి. ఎమ్మెల్యే, ఎంపీ తమ సొంత స్వలాభం కోసమే రాజకీయాల్లో కొనసాగుతున్నారు తప్పా ప్రజలకు చేసిందేమి లేదు. కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారాన్ని అందిస్తుందని ఇప్పటికే సీఎం ప్రకటించారు.

కట్టుదిట్టంగా ఎన్నికల నియమావళి అమలు

• కలెక్టర్ రాజార్షిషా



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, అధికారులు

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల పై రాష్ట్ర ముఖ్యఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్‌లతో శనివారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ రాజార్షిషా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్‌కుమార్, సంబంధిత అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ జిల్లాలో ఉపాధ్యాయులకు సంబంధించి 32 పోలింగ్ కేంద్రాలున్నాయని, జిల్లాలో ఎన్ని కల నియమావళి నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో పట్టభద్రులకు సంబంధించి 18 మం డలాల్లోని 32 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉపా ధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి 16,417 మంది ఓటర్లున్నారన్నారు. ఇప్పటికే ఎన్నికల షెడ్యూలు విడుదలైన నేపథ్యంలో జిల్లా వ్యాప్తం గా ఎన్నికల ప్రవర్తన నియమావళి కట్టు దిట్టం గా అమలయ్యేలా అన్నిచర్యలు తీసుకున్నా మన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన తుదిఓటర్ల జాబితాను తప్పిదాలకు తావులేకుం డా పక్కాగా రూపొందించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న టీచర్స్, పట్టభ ద్రుల ఓటరు దరఖాస్తులను పరిశీ లించి ఈనెల 7లోగా పరిష్కరించాలన్నారు. పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగే పోలింగ్ ప్రశాంత వాతావరణంలో పూర్తి పారదర్శకం గా జరిగేలా ఏర్పాట్లు చేసుకోవాలని, ఎన్నికల సిబ్బందిని నియమిస్తూ వారికి శిక్షణ అందించేందుకు మాస్టర్ ట్రైనర్‌లను గుర్తించాలని సూచించారు.

మార్కండేయ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : పరమ శివుని అనుగ్రహంతో అమర జీవిగా వరాలు పొందిన మార్కండేయ జీవిత చరిత్ర ప్రతి ఒక్కరికి స్ఫూర్తిగా నిలుస్తుందని ఆదిలాబాద్ శాసన సభ్యులు పాయల్ శంకర్ అన్నారు. శనివారం శ్రీ మార్కండేయ మహర్షి జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని భాగ్యనగర్ శివ మార్కండేయ ఆలయంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పద్మశాలి సమాజం తరపున ప్రతి చోట పట్టణం పల్లెల్లో జయంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించడం పట్ల అభినందించారు. ఆలయ కమిటీ ప్రాతినిధ్యం మేరకు ఆలయ పునర్ నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు.పెండింగ్ లో ఉన్న నిర్మాణ అభివృద్ధి పనులు ఫలితకదిన పూర్తి చేయాలని ఎండోమెంట్ అధికారులకు సూచించారు. అనంతరం భాగ్యనగర్ పద్మశాలి ఆలయ కమిటీ తరపున ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఘనంగా అభినందించారు. శ్రీ మార్కండేయ జీవిత చరిత్ర పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పద్మశాలి అఫీషియల్స్ ప్రొఫెషనల్స్ జిల్లా అధ్యక్షులు బేత రమేష్, తాలూకా అధ్యక్షులు బొమ్మ కంటి రమేష్, జిల్లా కన్వీనర్ జక్కుల సత్యనారాయణ, చిలుక విలాస్, చిప్ప గంగన్న, దాసరి రమేష్, మాటేటి రాజు, రాకేష్, సాయి కృష్ణ, సాయి ప్రశాంత్, సత్యనారాయణ శ్యామల రాజన్న, దాసరి ప్రశాంత్, సాయి కృష్ణ, పూజారి సత్యనారాయణ పాల్గొన్నారు.

జిల్లా పేరును నిలబెట్టాలి : ఎమ్మెల్యే అనిల్


విద్యార్థినులకు జెర్సీలు అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌బాల్ స్టేట్‌మీట్‌కు శనివారం వెళుతున్న విద్యార్థినీలకు ఆల్‌దిబెస్ట్ చెప్పారు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్. ఆర్మూర్‌లో జరుగు తున్న సాఫ్ట్ బాల్‌స్టేట్ మీట్‌కు వెళుతున్న ఆదిలాబాద్ టీమ్‌కు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నేరడిగొండలో ఆల్‌ది బెస్ట్ చెప్పారు. ఈ సందర్భంగా వారికి జెర్సీలను అందజేసి మాట్లాడుతూ సాఫ్ట్ బాల్‌లో జిల్లా పేరు నిలబెట్టాలన్నారు. ఖచ్చితంగా కప్పుతోనే తిరిగి రావాలని అన్నారు.

లక్ష్మీనారాయణస్వామిని దర్శించుకున్న న్యాయాధికారి


ఆలయాన్ని దర్శించుకున్న జిల్లా న్యాయాధికారి

జైనథ్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని అతి పురాతనమైన లక్ష్మీ నారాయణ స్వామి ఆలయాన్ని శనివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా న్యాయాధికారి దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారిని ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జె.ముకేష్, జి.శ్రీనివాస్, సిహెచ్ సంపత్, అరుణ, అజయ్‌కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ రుకేష్ రెడ్డి, ఎస్సై పురుషోత్తం పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి


విద్యార్థి పఠన సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీఈవో

గుడిహత్నూర్ ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో వందశాతం సాధించేలా విద్యా ర్థులను సన్నద్ధం చేయాలని డీఈవో ప్రణీ త అన్నారు. శని వారం మండలంలోని సీతాగొంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీఈవో తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ, తరగతి గదులు, మధ్యాహ్న భోజనం సిద్ధం చేసే గది, వండే విధానాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం తయారు చేస్తున్నారా అని ఆరా తీశారు. విద్యార్థుల పఠన సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం డీఈవో మాట్లాడు తూ పదోతరగతి పరీక్షల నేపథ్యంలో విద్యా ర్థులను సిద్ధం చేయాలని, ప్రతిరోజు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. ప్రతి పాఠ్యాంశాన్ని అర్థమయ్యేలా వివరించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ప్రతి రోజు విద్యార్థులకు అల్పాహారం సక్రమంగా అందిం చాలన్నారు. డీఈవో వెంట ఎంఈవో ఉదయ్ రావు ఉన్నారు.

ఏటీడబ్ల్యుఏసీ చైర్మన్‌గా అవకాశం ఇప్పించండి

• మంత్రి సీతక్కను కోరిన గేడం నీరంజన్

ఉట్నూర్, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన పోరాటంలో తన కుమారుడిని కోల్పోయానని, ముఖ్యమంత్రి తెలంగాణ అమరవీరులకు న్యాయం చేస్తామని ప్రకటించినందున తనను ఉట్నూర్ ఐటీడీఏ ఆదిమ గిరిజనుల అభివృద్ధి సలహా (ఏటీడబ్ల్యుఏసీ)చైర్మన్‌గా నామినేటెడ్ అవకాశం ఇవ్వాలని నార్నూర్ మండలంలోని బలాన్పూర్‌కు చెందిన గేడంనీరంజ న్‌మంత్రి సీతక్కను కోరారు. శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రంసు గుణక్క నివాసంలో ఇన్‌చార్జీ మంత్రిని కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించినట్లు నిరంజన్ తెలిపారు.

తెలంగాణ బీడీ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా గోవర్ధన్

బోథ్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షునిగా బోథ్‌కు చెందిన బి.గోవర్ధన్ ఎన్నికయ్యారు. జనవరి 30, 31వ తేదిన జరిగిన మహాసభల్లో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటివరకు ఆయన వీడియో వర్కర్స్ జిల్లా అధ్య క్షునిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీడీ కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానన్నారు.

కొట్టాల పోచమ్మ విగ్రహావిష్కరణలో పాల్గొన్న నాయకులు

బోథ్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కొట్టాల పోచమ్మ విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమానికి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడేగజేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, ఇచ్చోడ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొమురం కోటేష్‌తోపాటు మాజీ ఎంపీటీసీ కురుమే మహేందర్‌లతో కలిసి పూజా కార్యక్రమాల నిర్వహించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. పట్టణ ప్రజలు ఐకమత్యంతో పోచమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠాపించుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షులు మెరుగు భోజన, పార్టీ నాయకులు జిల్లా అధికార ప్రతినిధి పశుల చంటి, సహకార సంఘం డైరెక్టర్ చెట్ల ఉమేష్, గడ్డల నారాయణ, నారాయణ పాల్గొన్నారు.

ఆదిలాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 5వ తేదీన అప్గ్రాడ్ ఆధ్వర్యంలో ప్రముఖ బ్యాంకింగ్, ఫైనాన్స్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ అతీక్ బేగం ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా డిగ్రీ 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై, 30 సంవత్సరాల లోపు వారు అర్హులని తెలిపారు. రూ.18 వేల వేతనం ఉంటుందని పేర్కొన్నారు.

నిరాదరణకు గురైన మహిళకు పీవో అండ


ఐదునెలల పాప కోసం పాల డబ్బా అందిస్తున్న పీఓ ఖుష్బుగుప్తా

ఉట్నూర్, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి) : పేదరికంలో ఉన్న మహిళ తన చంటి బిడ్డ పాల కోసం ఐటీడీఏను ఆశ్రయించడంతో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా అండగా నిలబడ్డారు. గుడిహత్నూర్ మండలంలోని తోషం గ్రామానికి చెందిన గిరిజన యువతి సుజాత గత సంవత్సరం సెప్టెంబర్ 4న పుట్టిన తన పాపకు పాలు లేక ఇబ్బంది అవుతుందని అక్టోబర్ 7న ఉట్నూర్ ఐటీడీఏ చేరుకొని గిరిజన దర్బార్‌లో పీవోకు వినతి పత్రం సమర్పించింది. దీనిపై స్పందించిన ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా ఐసీడీఎస్ సీడీపీవో ఉమను పిలిపించి ప్రతినెల పాల డబ్బా ఇప్పిస్తామని చెప్పి పంపించారు. గత ఐదునెలలుగా సుమారు 44 వేల విలువ గల పాల డబ్బాలను పాపకు సమకూర్చడంతో పాప చురుకు దనంతో ఆరోగ్యంగా ఉందని సీడీపీవో ఉమ తెలిపారు. అంతేకాకుండా ఆరో గ్యలక్ష్మి పథకం ద్వారా అంగన్‌వాడీ కేంద్రంలో తల్లీబిడ్డలకు పౌష్టికాహారం అందించడం జరిగిం దని వివరించారు. చలికాలం కావడంతో ఆదిలా బాద్‌లోని శిశుగృహ వారిని సంప్రదించి చిన్న పాప కోసం స్వెటర్, సాక్స్, టోపీ, పరుపు తెచ్చి ఇచ్చామని తెలిపారు. శనివారం ఐటీడీఏ పీవో చాంబర్‌లో తల్లీబిడ్డ కలిసి పీవోకు కృతజ్ఞతలు తెలపడంతో ఐటీడీఏ పీవో సంతృప్తి వ్యక్తం చేసి సీడీపీవోను ఉమను ప్రశంసించారు.

ఏడీసీసీ బ్యాంకు ఏర్పాటు చేయాలి

నార్నూర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీ ప్రాంత ఆదివాసీ దళిత రైతు ప్రజలకు మెరుగైన సేవలను అందించేలా నార్నూర్ మండలకేంద్రంలో ఏడీసీసీ బ్యాంకును ఏర్పా టు చేయాలని రైతు కార్మికుల సంఘం ఉమ్మ డి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు అశోక్ రాథోడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నా ర్నూర్ మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వపరంగా సంక్షేమ ఫలాలు ప్రజలకు అందాలంటే ముఖ్యంగా బ్యాంక్ సేవలను చాలా అవసరమన్నారు. రైతు అభివృద్ధి దిశగా పని చేస్తున్న ఏడీసీసీ బ్యాంకు ద్వారా రైతులకు అనేక లాభాలు జరుగుతాయి అభిప్రాయపడ్డారు. రైతుల కు మేలు చేసే దిశగా వెంటనే ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకొని ఏడీ సీసీ బ్యాంకు సేవలు అం దించేలా డీసీసీబీ చైర్మన్, సీఏ సహకరించాలని కోరారు.